# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 7, జూన్ 2026


# కేంద్ర మంత్రికి వినతి పత్రం



**మంచిర్యాల, జూన్ 6, ప్రభాతవార్త**

మంచిర్యాల,హైదరాబాద్ మధ్య ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచిర్యాల,హైదరాబాద్ మధ్య వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాల కోసం ప్రత్యామ్నాయ జాతీయ రహదారి అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నాగ్‌పూర్, హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ హైవేను చంద్రపూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, సిద్దిపేట మీదుగా హైదరాబాద్ వరకు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఈ మార్గం అమలులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. అలాగే ప్రయాణ సమయం తగ్గి, రహదారి ప్రమాదాలు మరియు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వివరించారు. ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని రఘునాథ్ వెరబెల్లి విజ్ఞప్తి చేశారు.

# నిర్మల్ జిల్లాలో ఆర్‌సెటీ ఏర్పాటుకు చర్యలు ముమ్మరం

● నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, జూన్ 06, ప్రభాతవార్త:**

జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌సెటీ ఏర్పాటుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా గ్రామీణ యువతకు మిగతా 2లో..

# నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

## ఇద్దరు అరెస్ట్ - 30 కిలోల నకిలీ విత్తనాలు, కారు స్వాధీనం



**మందమర్రి, జూన్ 6, ప్రభాతవార్త**

మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్స రమేష్ ప్రత్యేక పర్యవేక్షణలో నకిలీ విత్తనాల విక్రయదారులపై మందమర్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టిన మెరుపు దాడిలో నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టైంది. అమాయక రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలు మరియు రవాణాకు ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మందమర్రి పరిధిలోని రామన్ కాలనీ బ్రిడ్జి సమీపంలో నకిలీ విత్తనాల రవాణా జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారంతో మందమర్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మిగతా 2లో..

## గ్రామ సభలతో సమస్యలకు


# తక్షణ పరిష్కారం

✧ అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**బెల్లంపల్లి, జూన్ 06, ప్రభాతవార్త**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య తెలిపారు. శనివారం రోజున బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ జరుపుల సాయికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఆయన ప్రత్యేక అధికారిగా వేదాల శ్రీనివాస్, ఏఎస్ఐ బాబాజీ తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు వేగవంతం చేయడమే కాకుండా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వన మహోత్సవం, ఓటర్ల జాబితా సవరణ, వరద నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో మురుగు కాలువ నిర్మాణం, అంగన్వాడీ భవనం కోసం భూమి కేటాయింపు, చెరువు తూముల మరమ్మతులు, మిగతా 2లో..






## నీట్–2026 పరీక్ష ఏర్పాట్లను

# పకడ్బందీగా నిర్వహించాలి

❋ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు

**నస్పూర్, జూన్ 6, ప్రభాతవార్త**

రాష్ట్రంలో నీట్2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సిపిలు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్–2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్–2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల మిగతా 2లో..

## గ్రామ సభలతో సమస్యలకు తక్షణ పరిష్కారం

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రమాదకర విద్యుత్ స్తంభాలు మరియు తీగల సమస్యలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి పౌరుడు నీటి వృథాను నివారిస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి, ఏవైనా మోసాలు జరిగితే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఈఎల్ఎస్ఆర్, నీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అమృత్ 2.0 పథకం కింద రూ.63 కోట్లతో చేపట్టిన ఈ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, ఆశా మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

**(మొదటిపేజీ తరువాయి)**

అనుమానాస్పదంగా సంచరిస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు (టీఎస్ 19 హెచ్ 5554)ను ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు, బిల్లులు లేకుండా తరలిస్తున్న 30 కిలోల నకిలీ పత్తి విత్తనాలు బయటపడ్డాయి. విచారణలో పట్టుబడిన వారిని శ్రీపతి నగర్‌కు చెందిన మహమ్మద్ సాహెబ్ జానీ (54), అతని కుమారుడు మహమ్మద్ అఫ్రోజ్ (29)గా గుర్తించారు. నిందితులు బైంసాకు చెందిన వ్యక్తి వద్ద నుంచి కిలో రూ.1,000 చొప్పున నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి, మందమర్రి పరిసర గ్రామాల రైతులకు కిలో రూ.2,500 చొప్పున విక్రయించి భారీ లాభాలు ఆర్జించాలని యత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. రైతులను నమ్మించే ఉద్దేశంతో పేరొందిన కంపెనీల బ్రాండెడ్ సంచులను ఉపయోగిస్తూ మోసానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ కేసును ఛేదించడంలో చొరవ చూపిన ఎస్సై జి. నరేష్, కానిస్టేబుళ్లు రాకేష్, చైతన్యలను సీఐ పర్స రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోరారు. ఎక్కడైనా నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బెల్లంపల్లిలో టిబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం

### - ప్రజలకు అవగాహన, ఉచిత పరీక్షలు

**బెల్లంపల్లి, జూన్ 06, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తి 34వ వార్డులో వినాయక మండపంలో 34వ వార్డు కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి ఆధ్వర్యంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టిబి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్ శిబిరానికి హాజరైన ప్రజలు, రోగులతో మాట్లాడి క్షయవ్యాధి (టీబీ)పై అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే టిబి అనుమానించాల్సిందిగా సూచిస్తూ, తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అవగాహన కోసం పోస్టర్లను విడుదల చేసి ప్రజలకు వివరించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో టిబి నిర్ధారణకు తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి పూర్తిగా ఉచిత చికిత్సతో పాటు చికిత్స పూర్తయ్యే వరకు ప్రభుత్వం ప్రతి నెల రూ.1000 పోషణ భత్యం అందిస్తోందని వివరించారు. అలాగే రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి టిబి త్వరగా సోకే అవకాశం ఉంటుందని, అందువల్ల పోషకాహారం తీసుకోవడం అత్యంత అవసరమన్నారు. తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారు, పొగాకు వినియోగించే వారికి ఎక్కువగా సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి వివిధ పరీక్షలు నిర్వహించారు. తెమడ పరీక్ష కోసం 10 మందిని నమోదు చేయగా, ఎక్స్ రే అవసరమైన 89 మందికి హనుమాన్ బస్తి వినాయక మండపంలోనే పోర్టబుల్ ఎక్స్ రే యంత్రంతో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీనివాస్, డివిజన్ క్షయవ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, డాటా ఎంట్రీ ఆపరేటర్ మురళి, ఏఎన్ఎమ్ లు రేకుంట్ల స్వప్న, లక్ష్మి, ఎక్స్ రే టెక్నీషియన్ ప్రేం, ఆశ కార్యకర్తలు స్వరూప, రేణుక, పరమేశ్వరీ, మాణిక్యం, భాగ్యశీల తదితరులు పాల్గొని సేవలందించారు.



### నీట్–2026 పరీక్ష ఏర్పాట్లను

# పకడ్బందీగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్టిసి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అదనపు డిజిపి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 1 వేయి 204 మంది అభ్యర్థులు నీట్ 2026 పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖాధికారి లలిత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో ఆర్‌సెటీ ఏర్పాటుకు చర్యలు ముమ్మరం

**(మొదటిపేజీ తరువాయి)**

వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ సహకారంతో ఆధునిక సదుపాయాలతో ఆర్‌సెటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కేంద్రం ద్వారా తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగు, మత్స్య సంపద, పాడి పరిశ్రమ, కంప్యూటర్, సాంకేతిక ఆధారిత కోర్సులు, చిన్న వ్యాపారాల నిర్వహణ, సేవారంగ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఇవి యువతకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఉట్నూర్, నిజామాబాద్ జిల్లాల్లోని ఆర్‌సెటీ కేంద్రాల్లో అమలవుతున్న కోర్సులు, శిక్షణ విధానాలు, లబ్ధిదారుల ఎంపిక, ఉపాధి కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ విధానాలను అధ్యయనం చేసి నిర్మల్ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతిపాదిత ఆర్‌సెటీ కోసం స్థలం, మౌలిక సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాల రూపకల్పనపై సంబంధిత శాఖలు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులకు ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని, నిజమైన ఓటరు ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని సూచించారు. అలాగే జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తల్లి పేరిట ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

### - సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్ పిలుపులో భాగంగా సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు హైదరాబాద్‌లోని తన నివాసం ఎదురుగా మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆయన మాతృమూర్తి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి పాల్వాయి రాజ్యలక్ష్మి కూడా పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో చెట్ల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్ పిలుపును ప్రజలందరూ స్వీకరించి, తమ తల్లి పేరిట కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు.ఈ వర్షాకాలం ప్రారంభం సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం ద్వారా భూమిపై పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు.

## 41 రోజుల ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమానికి ఘన ముగింపు

### - కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి సేవా కార్యక్రమం విజయవంతం

**మంచిర్యాల, జూన్ 6, ప్రభాతవార్త**



కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మంచిర్యాల ఎమ్మెల్యే శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం ఘనంగా ముగింపు పలికారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బస్టాండ్, మార్కెట్, ఐబీ చౌరస్తా, హమాలివాడ, సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ ప్రాంతాలతో పాటు లక్షెట్టిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు నిరంతరంగా సేవలు అందించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్ మాట్లాడుతూ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41 రోజుల పాటు, లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్ చౌరస్తా వద్ద 37 రోజుల పాటు అంబలి పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని వారు కొనియాడారు. ముఖ్యంగా ఎండాకాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అలాగే ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దాతలు మరియు స్వచ్ఛందంగా సేవలందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వృక్ష సంపదను పెంచితేనే మానవ మనుగడ

**భైంసా, జూన్ 06, ప్రభాతవార్త:**

వృక్ష సంపదను పెంచుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుండాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.జీవపరిణామానికి అత్యంత అవసరమైన ఆక్సిజన్ కొరత ఏర్పడి, విషవాయువులు పెరిగిపోవడం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ భీమ్రావు, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ శంకర్, డాక్టర్ గుంత సుధాకర్ పాల్గొన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఆరే రాజు, డాక్టర్ ఓం ప్రకాష్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ కల్పన, అధ్యాపకులు మజార్, అబ్దుల్లా, దివ్య, సురేందర్, శ్రవణ్య, అర్షియా, ఇర్ఫాన్, ఉజ్మా, సమరిన్, ముత్యం, వహీద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి

## - సబ్ కలెక్టర్ మనోజ్

**వేమనపల్లి, జూన్ 06, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ శనివారం పరిశీలించారు. తహసీల్దార్ సాయికృష్ణతో కలిసి జిల్లేడ, సూరారం, నాగారం, మంగనపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్, గొర్లపల్లి, క్యాతన్‌పల్లి, బద్దెవెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, రవాణా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. రవాణా కాంట్రాక్టర్లు అదనపు వాహనాలను సమకూర్చి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ధాన్యం సేకరణ, నిల్వ, రవాణా ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన,



పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# వానాకాలం సాగుకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

## - ఎంఏఓ వికార్ అహ్మద్

**సారంగాపూర్, జూన్ 06, ప్రభాతవార్త:**

మండలంలోని రైతు సోదరులందరూ వానాకాలం సాగు పనుల్లో భాగంగా గ్రామస్థాయిలో అందుబాటులో ఉన్న వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) సూచనలను తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) వికార్ అహ్మద్ కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు ఆశించిన స్థాయిలో సక్రమంగా కురవకపోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని రైతు సోదరులు గమనించి, కాలానుగుణంగా ఎలాంటి పంటలు వేసుకోవాలో ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఏ రకమైన విత్తనాలు వేసుకోవాలో తమ సమీప ఏఈఓలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. మార్కెట్లో విత్తనాలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి కావడంతో రైతులు తొందరపడి నష్టపోకుండా, సరైన ప్రణాళికతో సాగు చేయాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వ్యవసాయ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కిశోర బాలికల్లో ఆరోగ్య, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యం

## - డీఆర్డీఓ విజయలక్ష్మి

**దిలావర్‌పూర్, జూన్ 06, ప్రభాతవార్త:**

కిశోర బాలికలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని నిర్మించుకోవడంతో పాటు సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి సూచించారు. ప్రజా ప్రణాళిక ప్రగతి కార్యక్రమంలో భాగంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్నేహ కిశోర బాలికల సమావేశంలో ఆమె పాల్గొని మార్గనిర్దేశం చేశారు. బాలికలు పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా ప్రోటీన్లు, విటమిన్లు, ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రుల సూచనలను తప్పక పాటించాలని కోరారు. సోషల్ మీడియా వినియోగంలో అత్యంత జాగ్రత్త అవసరమని, విలువైన సమయాన్ని వృథా చేయకుండా భవిష్యత్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం బాలికలకు రక్తహీనత (ఎనిమియా) పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన జాగ్రత్తలను వివరించగా, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ సంధ్యారాణి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపడవద్దని బాలికలకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎం శోభారాణి, ఏపీఎం బోస్, పీహెచ్ఎన్ దుర్గాభవాని, సీసీలు ముత్యం, పోశెట్టి, శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, అకౌంటెంట్ మహేష్, వీవోలు, పెద్ద సంఖ్యలో కిశోర బాలికలు పాల్గొన్నారు.



# ప్రత్యేక గ్రామ సభ నిర్వహణ

## - మన గ్రామం మన బాధ్యత కార్యక్రమంపై అవగాహన

**వేమనపల్లి, జూన్ 6, ప్రభాతవార్త**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం నీల్వాయి గ్రామ పంచాయతీలో మన గ్రామం మన బాధ్యత పేరిట ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, ప్రత్యేక అధికారి ఎంపీఓ వెంకటేష్, సూరారం సర్పంచ్ సిడం శ్రీలత, ప్రత్యేక అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీరు, వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, వరదల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక అధికారి పవన్ కుమార్, ఎస్సై జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జాఫర్, వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య

# విద్యుత్ తీగలు తగిలి లేగదూడ మృతి

**వేమనపల్లి, జూన్ 6, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ లేగదూడ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం, వడ్ల లోడుతో వెళ్తున్న ఓ లారీ విద్యుత్ తీగలను తాకడంతో అవి తెగి కిందపడ్డాయి. అదే సమయంలో అక్కడ గడ్డి మేస్తున్న లేగదూడ తెగిపడిన విద్యుత్ తీగలను తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న లైన్‌మెన్ మార్కండేయ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేసి, తెగిన తీగలను పోల్‌కు బిగించారు. అనంతరం నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధితుడు రామగిరి పుల్లయ్యకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సన్మానిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

# నూతన పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

## - బదిలీపై వెళ్తున్న భోజన్నకు సన్మానం

**భైంసా, జూన్ 06, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామ నూతన పంచాయతీ కార్యదర్శిగా విజయ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తూ అందకూరు గ్రామానికి బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి భోజన్నను ముధోల్ మాజీ శాసనసభ్యులు జీవీ విట్టల్ రెడ్డి తన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. దేగాం గ్రామంలో భోజన్న అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం దేగాం గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు నూతన పంచాయతీ కార్యదర్శి విజయ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా చూస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యం రెడ్డి, మాజీ సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, గడ్డిగారి చందు రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జాదవ్ విక్రమ్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న యువశక్తి యూత్, పదో తరగతి మిత్ర బృందం

## శేషాద్రి కుటుంబానికి

# మిత్రుల ఆర్థిక సాయం

**నిర్మల్, జూన్ 06, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన తమ మిత్రుడు శేషాద్రి కుటుంబానికి యువశక్తి యూత్ సభ్యులు, పదో తరగతి సహచర మిత్రులు అండగా నిలిచి స్నేహ బంధాన్ని చాటుకున్నారు. నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన శేషాద్రి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మిత్రులంతా నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా యువశక్తి యూత్ సభ్యులు, శేషాద్రి పదో తరగతి క్లాస్‌మేట్స్ కలిసి ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. అందరూ కలిసి విరాళాలు సేకరించి, శనివారం కడ్తాల్ గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సేకరించిన 25,500 రూపాయల నగదును వారికి అందజేసి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ శేషాద్రి తమతో ఎంతో ఆప్యాయంగా ఉండేవాడని, అతని అకాల మరణం తమను తీవ్రంగా కలిచివేసిందన్నారు. డబ్బుతో అతని స్థానాన్ని భర్తీ చేయలేనప్పటికీ, కష్టకాలంలో ఉన్న కుటుంబానికి కొంత ఊరట కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ చిన్న సహాయం చేశామని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన యువకుల సేవా దృక్పథాన్ని, స్నేహ బంధాన్ని స్థానికులు ఈ సందర్భంగా అభినందించి కొనియాడారు.

# ఆకాంక్షిత బ్లాక్‌లో విద్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## - జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



తరగతి గదులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**తిర్యాని,జూన్ 6, ప్రభాతవార్త;**

జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ తిర్యాని మండలంలో విద్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శనివారం జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, మండల విద్యాధికారి అంజయ్యలతో కలిసి తిర్యాని మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాణిక్యపూర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లను సందర్శించి పాఠశాలలలోని తరగతి గదులు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ఆకాంక్షిత బ్లాక్ లోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ పనితీరును పరిశీలించి సమర్థవంతమైన వినియోగంపై సిబ్బందికి సూచనలు చేశారు. పాఠశాలల అభివృద్ధి, సదుపాయాల మెరుగుదల, డిజిటల్ బోధన పద్ధతుల అమలుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




బోల్తా పడిన వ్యాన్

## అదుపు తప్పి వ్యాను బోల్తా

**తాండూర్, జూన్ 6, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం అదుపు తప్పి వ్యాన్ బోల్తా పడింది. ఆగ్రా నుండి సిద్దిపేటకు ఆలుగడ్డల లోడుతో వెళ్తున్న ఐచర్ వ్యాన్ పెట్రోల్ బంక్ ఎదురుగా నిలిచి ఉన్న లారీని ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. ఘటన స్థలం వద్దకు తాండూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న బిఆర్ఎస్ నేత రాంచందర్

## బీరన్న ఆలయ నిర్మాణానికి నాయకుల ఆర్థిక సాయం

**తాండూర్, జూన్ 6, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని బీరన్న దేవుడి ఆలయ నిర్మాణానికి శనివారం ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలుక రాంచందర్ సిమెంటు బస్తాలు, నగదు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ రూ.5 వేలు నగదు ను ఆలయ కమిటీ సభ్యులకు వేర్వేరుగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో కుర్మవాడ సమీపంలో పెద్ద ఎత్తున వీరన్న ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, బీరన్న పండుగలోపు ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పోచంపల్లి గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్ మార్నింగ్ వాక్

**తాండూర్, జూన్ 6, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కుస్నపల్లి లక్ష్మణ్, ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి శనివారం పోచంపల్లి గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,బడేటి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అందరికీ ఉచిత కరెంటు వస్తున్నదా.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న బోరం శంకర్ ను పరామర్శించి బియ్యం, నగదు సాయం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొర్లపల్లి భామేష్, కాంగ్రెస్ నాయకులు మీసా శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పేద కుటుంబానికి ఆర్థిక సాయం, బియ్యం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మణ్

## డ్రగ్స్‌కు దూరంగా క్రీడలకు దగ్గరగా ఉండాలి

**వేమనపల్లి, జూన్ 06, ప్రభాతవార్త**

నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాజులపేట గ్రామంలో శనివారం యువతకు వాలీబాల్ కిట్లను నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువత క్రీడలు, విద్యపై దృష్టి సారించి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అలాగే మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, ఎవరైనా మాదక ద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. యువతకు క్రీడా సామగ్రి అందించిన నీల్వాయి పోలీసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## కార్పొరేట్‌కు బదిలీ అయిన డీవైపీఎం రాజేష్‌కు వీడ్కోలు

### - శ్రీరాంపూర్ పర్సనల్ విభాగం ఆధ్వర్యంలో సన్మానం

**నస్పూర్, జూన్ 6, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం డిప్యూటీ పర్సనల్ మేనేజర్ ఎం. రాజేష్ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుండి ఆయన రిలీవ్ అవుతున్న సందర్భంగా పర్సనల్ విభాగం ఉద్యోగులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రాజేష్‌ను శాలువాతో సత్కరించారు. రాజేష్ గతంలో ఆర్.కె 5 గని సంక్షేమ అధికారిగా, జీఎం కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని డీజీఎం అనిల్ కుమార్ కొనియాడారు. కార్పొరేట్‌లో కూడా సంస్థకు మంచి సేవలు అందించి ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య నేతృత్వంలో యూనియన్ నాయకులు కూడా రాజేష్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగం అధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.



డీవైపీఎం ఎం. రాజేష్‌ను సత్కరిస్తున్న డీజీఎం అనిల్ కుమార్, యూనియన్ ప్రతినిధులు



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ 9లో శనివారం ప్రత్యేక వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు యూసఫ్ ఖాన్, వార్డు కౌన్సిలర్ బసర్రత్ తస్కీన్, మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సభలో వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై అధికారులు ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు, సూచనలు, అభ్యర్థనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిని నమోదు చేసుకున్న అధికారులు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో వార్డు అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.



## డిఈవోను సన్మానించిన ఎమ్మార్సీ సిబ్బంది

**తిర్యాని, జూన్6, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని పాఠశాలలను జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి శనివారం సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. డిఈవోగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాతా మొదటి సారిగా తిర్యాని మండలానికి వచ్చిన సందర్బంగా మండల విద్యావనరుల వనరుల కేంద్రంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారిని మండల విద్యాధికారి కె అంజయ్యతో కలిసి ఎమ్మార్సి సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా డిఈవో మాట్లాడుతూ మండలంలో బడి ఈడు కలిగిన పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమొదు శాతాన్ని పెంచి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపు అన్ని పాఠశాలలకు నూతన పాఠ్యపుస్తకాలు పంపిణి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, తిరుపతి, ఎమార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కృషి చేస్తాం

**- తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేశవరావు కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.



ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్ సహకారంతో త్వరలోనే కమిటీ చైర్మన్ కేశవరావును కలిసి ఉద్యమకారుల సమస్యలు, గుర్తింపు అంశాలపై వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి సమగ్ర జాబితా తయారు చేస్తామని పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొనని కొందరు వ్యక్తులు ఉద్యమకారులమని చెప్పుకుంటూ సర్టిఫికెట్ల పేరుతో రూ.500 చొప్పున వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అసలైన ఉద్యమకారులు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బోగస్ ఉద్యమకారుల వ్యవహారాలపై తగిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయినవారు, గాయపడినవారు, కేసులు ఎదుర్కొన్నవారు, ఉద్యమానికి వివిధ రూపాల్లో సహకరించిన వారందరినీ గుర్తించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని కూడా గుర్తించి జాబితాలో చేర్చనున్నట్లు వెల్లడించారు. కేశవరావు కమిటీని కలిసిన అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమకారుల వివరాల సేకరణ చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి ఉద్యమకారులందరూ సహ కరించాలని కోరారు. అనంతరం పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన అర్హులైన ఉద్యమకారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో నిర్బంధాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఇప్పటి వరకు సరైన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేశవరావు కమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పాల్వాయి సుధాకర్‌రావు, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, సుభాష్, రమేష్ గౌడ్, జయదేవ్ అబ్రహం, తుమ్మ రమేష్, దుర్గం విస్తారు, జాడి కేశవ్, గోగర్ల కన్నయ్య, తాజాబాబా, కొప్పుల శంకర్, గజ్జల లక్ష్మణ్, మాచర్ల శ్రీనివాస్, జిలకర మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ నగర్ గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

## సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

**తాండూర్, జూన్ 6, ప్రభాతవార్త :**

గ్రామాల్లోని సమస్యల పరిష్కరానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నదని రాజీవ్ నగర్ సర్పంచ్ మామిడాల లలిత అన్నారు. రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై అవగాహన కల్పించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు,పారిశుద్ధ్య కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాపర్తి సుభాష్, ఎంపీఓ అనిల్ కుమార్, ఎస్సై ప్రసాద్, గ్రామ కార్యదర్శి రమాదేవి, కాంగ్రెస్ నాయకులు మామిడాల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.




ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ గోవర్ధన్

## సర్కారు బడుల్లోనే పిల్లలను చేర్పించండి

**దిలావర్‌పూర్, జూన్ 06, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని, బడి వయస్సు గల పిల్లలందరినీ సర్కారు బడుల్లోనే చేర్పించాలని మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ కోరారు. దిలావర్‌పూర్ మండలంలోని మాయాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీఓ గోవర్ధన్, ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని, వీటితో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం తదితర వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఏ ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రైవేట్ బడులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ప్రారంభమైన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూలీలు పాల్గొన్నారు.

## కొల్లూరులో ప్రత్యేక గ్రామ సభ

**- అభివృద్ధి, ముందస్తు ప్రణాళికలపై విస్తృత చర్చ**

**- ఓటర్ల జాబితా ముందస్తు సవరణ, ఖరీఫ్ ఏర్పాట్లు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయం**

**కోటపల్లి, జూన్ 06, ప్రభాతవార్త**

కోటపల్లి మండలంలోని కొల్లూరు గ్రామ పంచాయతీలో శనివారం మండల పరిషత్ అధికారి అక్తర్ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సైదుల బుదమ్మ సాయికుమార్, ఉపసర్పంచ్ దుర్గం రవి, వార్డు సభ్యులు సావర్కర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఇతర ప్రజాప్రతినిధులు, ఆశ సిబ్బంది గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి అక్తర్, సర్పంచ్ బుదమ్మ సాయి కుమార్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజల క్షేమమే లక్ష్యంగా ఆరు కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వంద శాతం ఓటర్ల జాబితా సవరణకు అధికారులు ఇంటింటికీ వస్తారని, అర్హులు ఫారం6, ఫారం7, ఫారం8 ద్వారా మార్పులు చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటా తడి, పొడి చెత్త కోసం నాలుగు విడి విడి డబ్బాలు వాడాలని, ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలన్నారు. జూన్ పదిహేను లోపు రైతులకు అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాలు లేదా సహకార సంఘాల ద్వారా బుక్ చేసుకోవాలని, నకిలీ విత్తనాలు అమ్మితే వంద నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ బృందాలు అందుబాటులో ఉన్నాయని, గంజాయి, గుడుంబా లాంటి వ్యసనాల సమాచారాన్ని 1908 నంబరుకు తెలపాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం నర్సరీలలో సిద్ధంగా ఉన్న వేప, చింత, మర్రి, కానుగ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. రాబోయే వర్షాకాలం, వరదలను తట్టుకునేందుకు విపత్తు సహాయక, స్థానిక రెస్క్యూ బృందాలు బోట్లు, లైఫ్ జాకెట్లతో సిద్ధంగా ఉన్నాయని, అత్యవసర పరిస్థితుల్లో పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లను పునరావాస కేంద్రాలుగా మారుస్తామని, విపత్తులు వస్తే భయపడకుండా 108, 101, 100 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**సారంగాపూర్, జూన్ 06, ప్రభాతవార్త:**

మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన షేక్ మోలానాను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరవెల్లి గ్రామానికి చెందిన షేక్ మోలానా (50) శనివారం తన టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై ఇల్లు దాటి బీరవెల్లి బస్టాండ్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోలానా కాళ్లకు, నడుము భాగానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా ఆయనను నిర్మల్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆయనకు చికిత్స అందుతోంది. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ జాదవ్ లక్ష్మణ్‌పై ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పర్యావరణ రక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ

**సారంగాపూర్, జూన్ 06, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన సారంగాపూర్ గ్రామంలో సర్పంచ్ కోనేరు భూమన్న ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ రక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో చేరే చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా చెత్తబుట్టల్లోనే సేకరించాలని, గ్రామ పంచాయతీ చెత్త సేకరణ బండి వచ్చినప్పుడు మాత్రమే అందులో వేయాలని సూచించారు. ఇళ్ల వద్దే తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు.వైద్య పరికరాలు, ఇంజక్షన్ సూదులు, మందుల బిళ్లల వ్యర్థాలను ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది నిర్దేశిత నిబంధనల ప్రకారం చెత్తబుట్టల్లోనే వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో పడేయవద్దని కోరారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఎలాంటి అంటువ్యాధులు, కాలానుగుణ రోగాలు ప్రబలకుండా ఉంటాయని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని, మన పరిసరాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి చైతన్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.





## విధి నిర్వహణలో

# నిబద్ధతకు గుర్తింపు

**- కానిస్టేబుల్ సురేందర్‌ను అభినందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**

మందమర్రి, జూన్ 6, ప్రభాతవార్త

మందమర్రి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈదునూరి సురేందర్‌కు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందనలు తెలిపారు. కోర్టు డ్యూటీ నిర్వహణలో ప్రతిభ, నిబద్ధత కనబర్చినందుకు ఆయనను ప్రత్యేకంగా గుర్తించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, కోర్టు విధుల నిర్వహణలో సురేందర్ చూపిన క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరి ఇతర సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది తమ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఇదే ఉత్సాహం, నిబద్ధతతో భవిష్యత్తులో కూడా విధులు నిర్వర్తిస్తూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సురేందర్‌కు ఆకాంక్షలు తెలిపారు. పోలీసు విధుల్లో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా మరింత ఉత్తమ సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని సీపీ పేర్కొన్నారు. సీపీ చేతుల మీదుగా సత్కారం అందుకోవడం పట్ల కానిస్టేబుల్ ఈదునూరి సురేందర్ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తానని తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**- చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్**

**- చెన్నూరులో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో విస్తృత తనిఖీలు**

చెన్నూరు, జూన్ 6, ప్రభాతవార్త

యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ యువతకు సూచించారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు కొత్త బస్టాండ్ ప్రాంతంలోని హోటల్స్, పాన్ షాప్ లలో నార్కోటిక్ డాగ్ సహాయంతో చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ తన సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు. కిష్టంపేట గ్రామంలో గంజాయి విక్రయించే అనుమానిత వ్యక్తుల ఇళ్లను డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి విక్రయించే అనుమానిత వ్యక్తుల ఇళ్లను తరచూ నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గుట్కా, జూదం, నాటు సారా, గంజాయి లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ కి బానిసలుగా మారి తమ భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, పేర్కొన్నారు.



# కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా కావాలి - శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

నస్పూర్, జూన్ 6, ప్రభాతవార్త



ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల స్టాల్‌ను పరిశీలిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్, పర్యావరణవేత్తలు

రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ప్రకృతి మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శనివారం పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మునిగంటి శ్రీనివాస్ ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన మట్టి, వెదురు పాత్రలు, జూట్ బ్యాగుల స్టాల్స్‌ను పరిశీలించి, బట్టసంచులు ఆవిష్కరించి పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ దేశ విద్యుత్ అవసరాల కోసం మైనింగ్ నిర్వహిస్తున్నప్పటికీ, అంతకు రెట్టింపు స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతోందని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 15 వేల హెక్టార్లలో ఐదున్నర కోట్లకు పైగా, శ్రీరాంపూర్ ఏరియాలోనే 1500 హెక్టార్లలో 22 లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు వివరించారు. ఖాళీ ప్రదేశాలు, ఓబీ డంపులు, పరిసర గ్రామాలలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడమే కాకుండా అటవీశాఖకు సైతం అందజేస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగం తగ్గించి స్టీల్ వస్తువులు వాడేలా అందరూ ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి ప్రాంతంలోని ప్రజలు, కార్మికులు ప్రకృతి అలవాట్లు పెంపొందించుకొని పర్యావరణ రక్షణలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ప్రకృతి మిత్ర వ్యవస్థాపక అధ్యక్షులు, పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ కోరారు. బజారుకు బట్ట సంచితోనే వెళ్లాలని, ప్రతి శుభకార్యంలో మొక్కలు నాటి గ్రీన్ గిఫ్టులు అందించాలని సూచించారు. చిన్న దూరాలకు సైకిల్ వాడాలని, ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వీరేశం, విశ్రాంత అటవీ అధికారి మల్లయ్య, ఫారెస్ట్ అధికారి సురేష్, నస్పూర్ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు రాజేశం, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, సంస్థ ప్రధాన కార్యదర్శి గోగు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## రుతుపవనాల రాక నేపథ్యంలో

# వరి కొనుగోలు వేగవంతం చేయాలి

**- సీఎస్ రామకృష్ణారావు**

నిర్మల్, జూన్ 06, ప్రభాతవార్త:



రానున్న రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణను తాకనున్నందున జిల్లాల్లో మిగిలిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరి కొనుగోళ్లు, జూన్ 9న మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం, నీట్ పరీక్ష ఏర్పాట్లపై సీఎస్ సమీక్షించారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ సమావేశంలో పాల్గొని జిల్లా వివరాలను సీఎస్‌కు వివరించారు. జిల్లాలో వరి కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఖాళీ అయ్యాయని, మిగిలిన ధాన్యం కొనుగోలును కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా నుండి లబ్ధిదారులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధని గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహణ

సారంగాపూర్, జూన్ 06, ప్రభాతవార్త:




మండలంలోని ధని గ్రామంలో సర్పంచ్ బడిపోతన్న అధ్యక్షతన శనివారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ఎంపీడీవో లక్ష్మీ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామసభలో పలు కీలక అంశాలపై చర్చించి ప్రత్యేక తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో లక్ష్మీ శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని సూచించారు. దోమల వ్యాప్తి, అంటువ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, పడే ప్రతి వర్షపు బొట్టునూ భూమిలోకి ఇంకేలా వర్షపు నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని కోరారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి వివేక్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

**- పంచముఖ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు**

**- మంత్రి దంపతులు ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలి: కాంగ్రెస్ నాయకులు**

మందమర్రి, జూన్ 6, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి – శ్రీమతి సరోజన దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మందమర్రి పట్టణంలోని పంచముచ హనుమాన్ ఆలయంలో మంత్రి దంపతుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు మంత్రి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకులు, మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పనలో మంత్రి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. మంత్రి దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, మైనారిటీ సెల్, సేవాదళ్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో

# పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

**- ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి - ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. లక్ష్మీ నరసింహం**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో శనివారం పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఎకో క్లబ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ర్యాలీని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. లక్ష్మీ నరసింహం జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు, అధ్యాపకులు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. భాస్కర్ రెడ్డి, సైంటిస్ట్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతంగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ తూడూరు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎకో క్లబ్ ఇంచార్జి డా. దేవేందర్ రెడ్డి, కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్, బోధన మరియు బోధనేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

**- కుంటోల్ల వెంకటస్వామి**

**నిర్మల్, జూన్ 06, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పాత్రికేయులు కొన్ని సంవత్సరాలుగా అక్రిడిటేషన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రెండో విడతలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు కూడా జిల్లా యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక జిల్లా కమిటీని ఏర్పాటు చేయడానికి నిర్మల్ జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరయ్యే వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోరాటం కొనసాగిస్తామని, హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

## భుక్య జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ బృందం

**దిలావర్‌పూర్, జూన్ 06, ప్రభాతవార్త:**

ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ భుక్య జాన్సన్ నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా గ్రీన్ ఇండియా చాలెంజ్ అధ్యక్షుడు రాథోడ్ అశోక్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాథోడ్ అశోక్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఒక బాధ్యతగా, అలవాటుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జన్మదినాలు, వివాహాలు, ఇతర శుభకార్యాలు వంటి ప్రత్యేక సందర్భాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే ప్రకృతికి ఎంతో మేలు చేసినవారమవుతామని చెప్పారు. భుక్య జాన్సన్ నాయక్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తోడిశెట్టి సుధన్, జాన్ సత్య, రాజేష్ మహారాజ్, రఫిక్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్తున్న ఏఈఓలకు సన్మానించిన రైతులు

**- ఏఈఓ సాగర్ సేవలు మరువలేనివి**

**- వీడ్కోలు సమావేశంలో అస్నాద్ గ్రామ పెద్దల వాక్య**

**చెన్నూరు, జూన్ 6, ప్రభాతవార్త**

గత 8 సంవత్సరాలుగా విస్తనాదికారి సాగర్ రైతులకు అందించిన సేవలు మరువలేనివని అస్నాద్ క్లస్టర్ రైతులు సాగర్ ను కొనియాడారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో బదిలీపై వెళ్తున్న ఏఈఓలకు రైతులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అస్నాద్ క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులకు చేదోడు వాదోడుగా ఉండి సేవలందించిన ఏఈఓ సాగర్, చెన్నూరులో విధులు నిర్వహించిన రాజశేఖర్‌లకు పలు గ్రామాల ప్రజలు వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెల్లంకొండ సజిత జగన్మోహన్ రావ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు కరుణ సాగర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల బాపు గౌడ్ మాట్లాడుతూ విస్తనాదికారి సాగర్ అస్నాద్ క్లస్టర్ పరిధిలోని రైతులకు ఎనిమిది సంవత్సరాలుగా సేవలందించారని, ఒక ఉద్యోగిగా కాకుండా రైతులతో కుటుంబ సభ్యునిగా ఉండేవాడని అన్నారు. రైతు బీమా వంటి పతాకాలను లబ్ధిదారులకు అందించడంలో మండలంలోనే అత్యధికంగా చెక్కులు అందించి గొప్ప మనసు చాటుకున్నారని అన్నారు. ఉద్యోగిగా తన ఎనిమిది సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు ఎలాంటి చిన్న రిమార్క్ లేకుండా తన వృత్తికే వన్నె తీసుకు వచ్చాడని కొనియాడారు. గత పంట కాలంలో కొంతమేర ఎరువుల కొరత వచ్చినప్పటికీ పై అధికారులతో మాట్లాడి తన క్లస్టర్ పరిధిలోని రైతులకు ఎరువుల బస్తాలు అందే విధంగా రాత్రి పగలు శ్రమించాడని అన్నారు. విధి నిర్వహణలో ఎండ వానలకు ఓర్చుకొని పనిచేసే వాడన్నారు. పంటలు చేతికి వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు సమయానికి టోకెన్లు పంపిణీ చేసేవాడని, ఇన్ని సంవత్సరాలుగా రైతులకు సేవలందించిన సాగర్ ఈరోజు బదిలీపై వెళ్లడం బాధగా అనిపించినా వృత్తిరీత్యా బదిలీల కారణంగా వెళ్లడం తప్పదు కాబట్టి ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా, మంచి పేరు తెచ్చుకొని రైతుల మన్ననలు పొంది ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఓ మల్లికార్జున్, ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏఓ యామిని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డ్ నెం. 8లో ప్రత్యేక వార్డు సభ

**- అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త :**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెంబర్ 8లో శనివారం ప్రత్యేక వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ షాహీన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య – లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి , టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన వార్డు సభలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యలు, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వార్డు ప్రజలు తమ సమస్యలు, అవసరాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నమోదు చేసుకున్న అధికారులు వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు వార్డు అభివృద్ధిని మరింత వేగవంతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం

**- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, జూన్ 6, ప్రభాతవార్త**

ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేవి సహజం, కొత్త ప్రాంతంలోనూ ఇదే నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభ్యున్నతికి కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. బదిలీపై మందమర్రి ఏరియాకు వెళ్తున్న డీజీఎం (ఈ అండ్ ఎం) రవీందర్‌కు శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో శనివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలో సుదీర్ఘకాలం సేవలు అందించి ప్రస్తుతం డీజీఎం (వర్క్‌షాప్)గా విధులు నిర్వర్తించిన రవీందర్‌ను ఏరియా అధికారులు, ఈ అండ్ ఎం అధికారుల సమక్షంలో శాలువాతో సత్కరించి రవీందర్ సేవలను జీఎం కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఇంజనీర్ రమణ రావు, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, ఎస్సార్పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డీజీఎంలు అనిల్ కుమార్, హరినారాయణ, రాజన్న, విజయ్ కుమార్, ఐకే ఓసీ, ఎస్సార్పీ ఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్లు రామకృష్ణ, నాగరాజు, డీజీఎంలు సాంబశివరావు, కృష్ణారెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

